క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించండి



పీవోతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్

భద్రాచలం: నియోజకవర్గంలోని గిరిజనుల సమస్యలను పరిష్కరించడానికి చొరవ చూపాలని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్‌ను కోరారు. బుధవారం ఐటీడీఏలో మర్యాదపూర్వకంగా కలిశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, ఎటువంటి ఆక్షలూ లేకుండా కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే పీఓను కోరారు. గిరిజన గ్రామాలకు త్రీఫేస్ కరెంట్ పనులను సత్వరమే చేపట్టి పోడు భూముల సాగుదారులకు విద్యుత్ సదుపాయాన్ని అందజేయాలని విజ్ఞప్తి చేశారు. వైద్య సేవలను మెరుగుపర్చాలని, పెండింగ్‌లో ఉన్న మిషన్‌భగీరథ పెండింగ్ పనులను పూర్తిచేసి అన్ని గ్రామాలకు తాగునీరు అందేలా చూడాలని అన్నారు. దుమ్ముగూడెం బీఆర్‌ఎస్ నాయకులు అన్నెం సత్యాలు పాల్గొన్నారు.

సాధనతో విజయం

మణుగూరుటౌన్: నిరంతర సాధనతోనే విజయం సాధ్యమవుతుందని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ అన్నారు. బుధవారం జీఎం కార్యాలయంలో జడ్చర్లలో డిసెంబర్ 8–10వ తేదీ వరకు నిర్వహించిన అండర్–16 ఫుట్‌బాల్ జూనియర్ నేషనల్ స్కూల్ గేమ్స్ స్టేట్ మీట్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లా తరుపున మణుగూరు మండల క్రీడాకారుడు సిద్ధి విఘ్నేశ్వర్ ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 27న అండమాన్ నికోబార్ దీవుల్లో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొననున్న విఘ్నేశ్వర్‌ను జీఎం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో అత్యున్నత ప్రదర్శన కనబర్చి విజేతగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధికారులు వీసం కృష్ణయ్య, వెంకటేశ్వర్లు సలగల రమేశ్, జాన్ వెస్లీ, ఆర్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

అశ్వాపురం: మండల పరిధిలోని మామిళ్లవాయి, సత్యనారాయణపురం, కట్టంవారిగూడెం గ్రామాలలో ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ సంకీర్తన ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సంకీర్తన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. చలికాలం కావటం వల్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కేశవాపురంలో..

చర్లరూరల్: చర్ల మండలం కేశవాపురం గ్రామంలో బుధవారం అసంక్రమిత వ్యాధుల వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 45 మందికి పరీక్షలు నిర్వహించారు. రక్తపోటు, షుగర్‌తో బాధపడుతున్న వారిని గుర్తించి పీహెచ్‌సీకి రిఫర్ చేశారు. అలాగే జ్వరాలతో బాధపడుతున్న వారికి వైద్యం చేసి మందులను పంపిణీ చేశారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి నీటి నిల్వలను గుర్తించి తొలగించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాంప్రసాద్, శిరీష, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వసతులు కల్పిస్తాం..

బూర్గంపాడు: ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతుల కల్పనకు వాసవి క్లబ్ చేయూతనందిస్తుందని క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ దోసపాటి వెంకటేశ్వరరావు అన్నారు. సారపాక గాంధీనగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాత్మగాంధీ, సరస్వతిదేవి విగ్రహాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో వసతులు కల్పించి ప్రోత్సహిస్తామన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ వైస్ గవర్నర్ గుమ్మడవెల్లి శ్రీనివాసరావు, డిస్ట్రిక్ట్ కార్యదర్శి దారా మల్లిఖార్జున్‌రావు, కోశాధికారి దారా నరసింహారావు, గ్రామపంచాయతీ ఈఓ మహేష్, వాసవి క్లబ్ ప్రతినిధులు కడవెండి విశ్వనాథ్‌గుప్తా, బండారు నర్సింహారావు, రమేష్‌బాబు పాల్గొన్నారు.

సమస్యలపై దృష్టి సారించాలి

మణుగూరురూరల్: సింగరేణి సంస్థ పరిరక్షణకు, కొత్త గనుల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని మణుగూరు ఏరియా ఈపీ ఆపరేటర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఈపీ ఆపరేటర్ల సూటబుల్ జాబ్ సమస్యను, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు, ఐఎన్‌టీయూసీ నేత త్యాగరాజన్‌కు సంతకాల సేకరణతో కూడిన వినతిపత్రం అందజేశారు. తొలుత ఎమ్మెల్యేను ఈపీ ఆపరేటర్లు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సమస్యలు వివరించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు సామా శ్రీనివాస్‌రెడ్డి, నామా వెంకటేశ్వరరావు, వెలగపల్లి జాన్, ఈపీ ఆపరేటర్లు ఎస్‌డీ.నాసర్‌పాషా, గట్టయ్య, కృష్ణంరాజు, రాములు, కుమారస్వామి, రాజలింగు, అంజయ్య, అహ్మద్ పాల్గొన్నారు.

చిన్నారులపై చలి ప్రభావం

- పెరుగుతున్న శ్వాసకోశ సమస్యలు, జ్వరాలు
- కిటకిటలాడుతున్న ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రులు
- తల్లిదండ్రులు నిర్లక్ష్యాన్ని వీడాలంటున్న వైద్యులు..



పీడియాట్రిక్ వార్డులో చికిత్స పొందుతున్న చిన్నారులు

భద్రాచలంఅర్బన్: చలి గాలులు, చల్లని వాతావరణంతో చంటి పిల్లల్లో శ్వాసకోశ వ్యాధులతో పాటు ఆస్తమా, న్యుమోనియా కేసులు నమోదు అవుతున్నాయి. భద్రాచలం ఏరియా ఆస్పత్రిలోని పిల్లల వార్డులో డిసెంబర్ 1 నుంచి 13వ తేదీ వరకు ఇప్పటికే 54 మంది చిన్నారులు చేరారు. కాగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో వీటి సంఖ్య రెండింతలు ఎక్కువగా ఉంటోంది. జలుబు, జ్వరం, దగ్గు, ఒళ్ళు నొప్పులతో చికిత్స కోసం ఎక్కువ మంది వస్తున్నారు. భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో పిల్లల వార్డులో గడిచిన 13 రోజులుగా మలేరియా జ్వరంతో 6 మంది, డెంగీతో 9 మంది, వివిధ రకాల జ్వరాలతో 14 మంది, ఊపిరి తీసుకోవడంతో ఇబ్బందిగా ఉండి 3 చిన్నారులు, బ్రోంకో లైట్ సమస్యతో 23 మంది చిన్నారులు చేరారు.

ఈ సీజన్‌లో అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు కూడా ఉన్నాయి. చల్లటి వాతావరణంలో వైరస్‌లు, బ్యాక్టీరియాలు వేగంగా వృద్ధిచెందుతాయి. మరోవైపు నవజాత శిశువులకు రోగనిరోధక శక్తి అంతగా వృద్ధి చెంది ఉండదు. దీంతో వ్యాధులు ప్రభావం మొదలవుతుంది. మూడు నెలల నుంచి ఏడాదిలో వున్న పిల్లలకు అస్తమా, నిమోనియా, దగ్గుతో ఉక్కిరి బిక్కిరై శ్వాస సమస్యలు తలెత్తుతాయి. శ్వాస కోశనాళాలు ఉబ్బి శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉంటుంది. దమ్ము, పిల్లి కూతలు వస్తుంటాయి. ఈ సమయంలో వెంటిలేటర్ వరకు తీసుకెళ్లే అవకాశముంటుంది. పరిస్థితి ఎక్కువైన కొందరు చిన్నారుల్లో ఫిట్స్ వచ్చే అవకాశం ఉంది. వ్యాధులు సోకకుండా నివారణ చర్యలు చేపట్టాలి. ఏడాది పైబడిన చిన్నారులకు చల్లటి నీరు, పానీయాలు, చాక్లెట్స్ వంటి తీపి పదార్థాలు ఇవ్వొద్దు. 10–12 సంవత్సరాల వయసులో అస్తమా వచ్చే అవకాశం ఉంటుంది. వాహనాల నుంచి వచ్చే పొగ, కాలుష్యంతో శ్వాసకోశ వ్యాధులు ప్రబలేఅవకాశం ఉంది. పిల్లలను పొగ పీల్చకుండా జాగ్రత్తపడాలి.

ఇతర సమస్యలు కూడా..

ఏజెన్సీ ప్రాంతంలో చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో పాటు ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఒకే ఒక్క పెద్ద ఆస్పత్రి కావడంతో భద్రాచలం ఏరియా ఆస్పత్రిలోని చిన్న పిల్లల వార్డులో చిన్నారులు న్యూమోనియాతో పాటు వైరల్ ఫీవర్, ఇతర వైరస్, బ్యాక్టీరియాల ద్వారా వచ్చే వ్యాధులు నయం కాడానికి ఎక్కువ రోజులు పడుతోంది. గతంలో రెండు రోజులు చికిత్స తీసుకున్న సమస్యకు ఇప్పుడు దాదాపు ఐదు రోజులు నుంచి వారం రోజుల వరకు చికిత్స పొందాల్సి వస్తోంది. మొదటి దశలో అతి తక్కువ స్థాయి ఉంటుంది. క్రమ క్రమంగా అది పెరిగి రెండో దశలో ఆస్తమా లక్షణాలు చోటు చేసుకుంటున్నాయని వైద్యులు చెబుతున్నారు. మూడు, నాలుగు దశల్లో వారానికి రెండు, మూడు సార్లు రాత్రి పూట దగ్గు, ఆయాసం వంటి సమస్యలతో వస్తాయని వైద్యులు చెబుతున్నారు.

మూడు రోజులు దాటితే..

సాధారణంగా జ్వరం మూడు రోజులు ఉంటుంది. వైద్య పరీక్షలు జ్వరం వచ్చిన మూడు రోజుల తరువాత మాత్రమే చేయించాలి. ఎలాంటి జ్వరం వచ్చినా ప్లేట్‌లెట్స్ తగ్గుతాయి. సాధారణంగా 1.5 లక్షల నుంచి 4.5 లక్షల ప్లేట్‌లెట్స్ ఉంటాయి. వీటి సంఖ్య 40 వేలకన్నా తక్కువగా ఉన్నా ప్రమాదం ఉండదు. శరీరంపై ఎర్రటి దద్దుర్లు ఏర్పడి అవి పగిలి రక్తం రావడం, మూత్రంలో రక్తం కారడం, దగ్గుతున్నప్పుడు రక్తం పడడం, పళ్లు తోముకుంటున్నప్పుడు రక్తం రావడం, ముక్కులో నుంచి రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తే ప్లేట్‌లెట్స్ ఎక్కించాల్సి ఉంటుంది.

వ్యాధులను గుర్తించండి ఇలా..

శ్వాసకోశ వ్యాధులతో ఎక్కువ మంది చిన్నారులు బాధపడుతున్నారు. జలుబు, శ్వాసతీసుకోవడం కష్టంగా ఉండటం ఈ వ్యాధుల లక్షణాలు. వ్యాధి ముదిరితే శ్వాస తీసుకోవడం చాలా కష్టంగా మారుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చికెన్‌పాక్స్ వ్యాధికి గురైతే జ్వరం వస్తుంది. ఒళ్లంతా దద్దుర్లుతో కూడిన పొక్కులు వస్తాయి. విపరీతమైన దురద జలుబు కూడా ఉంటుంది. మలేరియా వ్యాధి బారిన పడిన వారికి జ్వరం కొంత సేపు ఉండి తగ్గిపోవడం, మళ్లీ రావడం జరుగుతుంది. రాత్రి సమయాల్లో చలి, వణుకు వంటి లక్షణాలు కనిపిస్తాయని వైద్యులు చెబుతున్నారు. పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధవహించాలిచిన్నారుల ఆరోగ్యం విషయంలో తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలి.

రాత్రి సమయాల్లో బయటకు తీసుకెళ్లొద్దు



చలికాలంలో వీలైనంత వరకు చిన్నారులను బయటికి తీసుకెళ్లకపోవడం మంచిది. తప్పనిసరైతే మధ్యాహ్న సమయంలో మాత్రమే తీసుకెళ్లాలి. ఉదయం, సాయంత్రం చలి తట్టుకోవడం ఇబ్బందిగా ఉంటుంది. రోగనిరోధక శక్తి తక్కువగా ఉండటం వల్ల వ్యాధులు సోకుతాయి. బిడ్డ జన్మించిన కొన్ని నెలల తర్వాత చలికాలం ఆయిల్ మసాజ్ చేయాలి. దీంతో శారీరకంగా, మానసికంగా వృద్ధి చెందడానికి సహాయపడుతుంది.

– డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, పిల్లల వైద్య నిపుణుడు, ఏరియా ఆస్పత్రి, భద్రాచలం

నిర్లక్ష్యం చేయకండి



చలికాలంలో పిల్లలకు సర్వసాధారణంగా వచ్చే అనారోగ్యాలు దగ్గు, తుమ్ములు, జలుబు, చర్మం పగలడం. ఇవి చెప్పుకోవడానికి, చూడ్డానికి, చిన్నవిగానే అనిపిస్తాయి. దాంతో తల్లిందండ్రులు తమకు తెలిసిన చిన్న చిన్న చిట్కా వైద్యాలను పిల్లలు మీద ప్రయోగించే ప్రయత్నం చేస్తారు. కానీ చలి కాలంలో పిల్లలకి సోకే వైరస్‌లు మామూలు చిట్కాలకు తగ్గవు. డాక్టర్‌ని సంప్రదించి, వారి సలహాలను అనుసరించి మందులు తప్పనిసరిగా వాడాలి.

– డాక్టర్ రామకృష్ణ, డిప్యూటీ సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి, భద్రాచలం

రాజకీయ ప్రతినిధులతో సమావేశం



మాట్లాడుతున్న అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాఘవరెడ్డి

మణుగూరురూరల్: కొత్త ఓటర్ నమోదు ప్రక్రియపై మణుగూరు తహసీల్దార్, అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాఘవరెడ్డి బుధవారం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాఘవరెడ్డి మాట్లాడుతూ..ఈ నెల 20వ తేదీ నుంచి జనవరి 5, 2024 వరకు కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ జరుగుతుందన్నారు. ఓటర్ నమోదుకు ఈసీ అవకాశం కల్పించిందని, 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటర్‌గా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఓటర్ జాబితాలో మార్పులు, చేర్పులు చేసి జనవరి 8వ తేదీన విడుదల చేస్తామన్నారు. జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే జనవరి 22వ తేదీన అభ్యంతరాలను స్వీకరించి మరోసారి బీఎల్‌ఓ ఇంటింటికి వెళ్లి పూర్తి స్థాయిలో పరిశీలన చేస్తారని తెలిపారు. అనంతరం ఫిబ్రవరి 2వ తేదీన జాబితా కూర్పు చేసి 8న తుది జాబితాను ప్రకటిస్తామన్నారు. ఫారం 6ద్వారా నూతన ఓటర్లుగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే బీఆర్‌ఎస్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

మణుగూరురూరల్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్‌ఎస్ పార్టీ ఎల్లవేళలా పని చేస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలెవరూ అధైర్యపడొద్దన్నారు. జిల్లా వ్యాప్తంగా నాలుగు నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ ఓడిపోవడానికి తానే నైతిక బాధ్యత తీసుకుంటున్నానన్నారు. ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమని, ప్రజల తీర్పును మనందరం గౌరవించాలన్నారు. నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు సాధ్యం కాని పథకాలతో ప్రజలను మభ్యపెట్టి గెలిచిందన్నారు. ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, బీఆర్‌ఎస్ నాయకులు ముత్యంబాబు, సతీష్‌రెడ్డి, రమాదేవి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

పర్ణశాలలో అధ్యయనోత్సవాలు



మత్స్యావతారంలో పర్ణశాల రామయ్య

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాలలో వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ముందుగా ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. అనంతరం అధ్యయనోత్సవాల్లో భాగంగా మొదటి రోజు పర్ణశాల రామయ్యను ఆలయ అర్చకులు మత్స్యావతారంలో అలంకరించారు.

శ్రీ మహావిష్ణువు ధరించిన అవతారాల వరుసలో మొట్టమొదటి అవతారం మత్స్యావతారం. అవతారం గురించి పురాణాల్లో రెండు రకాల గాథలు ఉన్నాయి. ఈ అవతారాన్ని పూజించుట వల్ల కేతుగ్రహ బాధలు తొలగుతాయని పురాణాలు వివరిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కె.ఉదయ్‌కుమార్ చేత శ్రీరామవనవాసం హరికథను భక్తులకు వినిపించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు అమరవాది కిషోర్‌కుమారాచార్యులు, శేషం కిరణ్‌కుమారాచార్యులు, భరద్వాజచార్యులు, నరసింహాచార్యులు, ఆలయ ఎఈఓ శ్రావణ్‌కుమార్, అనిల్‌కుమార్, సూపరిండెంట్ కిషోర్, ఇన్‌చార్జ్ ప్రసాద్, సిబ్బంది శివ, రాము పాల్గొన్నారు.

కుర్చీలు వితరణ

మణుగూరురూరల్: మండలంలోని మణుగూరు ప్రథమశ్రేణి జ్యుడిషియల్ కోర్ట్ ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేదరమెట్ల శ్రీనివాసరావు తన తండ్రి నరసింహారావు జ్ఞాపకార్థం 20 కుర్చీలను బుధవారం మెజిస్ట్రేట్ ఎం.వెంకటేశ్వర్లు చేతుల మీదుగా బార్ అసోసియేషన్‌కు వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ఏ.రామ్మోహన్‌రావు, జాడి చొక్కయ్య, డి.కవిత, వి.శైలజ, వి.పద్మావతి, ఏ.సంధ్య తదితరులు పాల్గొన్నారు.

రిలే దీక్షల విరమణ

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ ఎదుట గోండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో జీఓ నం.45ను అమలు చేయాలని కోరుతూ.. రెండు రోజులగా నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలను ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ హామీతో బుధవారం విరమించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావ్ మాట్లాడుతూ.. భద్రాచలం ఏజెన్సీలోని ఆదివాసీల సమస్యల పరిష్కారానికి స్థానిక ఐటీడీఏ పీఓతో చర్చించి, జీఓ నం.45ను అమలు చేసే విధంగా కృషి చేస్తాన్నారు. నరసింహారావు, సున్నం రమేష్, కారం రమేష్, ప్రకాష్, ఆదినారాయణమూర్తి, సురేష్, విజయ, జ్యోతి, వెంకటేశ్వరరావు, ప్రసాద్, గోపి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్లు

అశ్వాపురం: మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బుధవారం 1992–93 సంవత్సరం 10వ తరగతి పూర్వ విద్యార్థులు కొర్లకుంట శ్రీనివాసరావు, తాడబొయిన వెంకటేశ్వర్లు, రవికుమార్, భారజల కర్మాగారం రిటైర్డ్ ఉద్యోగి లక్ష్మీప్రసాద్‌లు పాఠశాలకు నాలుగు సీలింగ్ ఫ్యాన్లు వితరణగా అందజేశారు. తాడబొయిన వెంకటేశ్వర్లు, యశోద దంపతులు రూ.వెయ్యి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం యోగితావేణి, ఉపాధ్యాయులు శేషాచార్యులు, ప్రశాంతికుమారి, జ్యోతి, నాగభూషణం, శేఖర్, పద్మజకుమారి పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

చర్ల: తుపాన్ వల్ల పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కెచ్చెల రంగారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం చర్లలోని డీవీకే భవన్‌లో జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే వ్యవసాయ అప్పుల్లో కూరుకుపోయిన రైతాంగానికి తుపాన్ మరింత అప్పు మిగిలిందని అన్నారు. మిర్చి పంటకు రూ.లక్ష, వరి పంటకు రూ.50 వేల చొప్పున పరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ నాయకులు చిమిడి సుజాత, శ్రీకాళ మోహమూద్, సామ్రాజ్యం, కల్యాన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులెవరూ అధైర్యపడొద్దు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: అకాల వర్షాల వల్ల నష్టపోయిన పినపాక నియోజకవర్గ రైతులెవరూ అధైర్యపడొద్దని, అందరినీ ప్రజా ప్రభుత్వమైన కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం పినపాక నియోజకవర్గ ఎన్నికల ప్రచార కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జరిగిన నష్టంపై వ్యవసాయ అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం వివరాలు సేకరించి పరిహారం అందేలా కృషి చేస్తామన్నారు. ఐకేపీ సెంటర్‌ను ఏర్పాటు చేసి వ్యవసాయాధికారుల ద్వారా పంటను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పినపాక నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపునకు కృషి చేసిన మిత్రపక్షాలకు, కార్మికులకు, కార్మిక కుటుంబాలకు, సీపీఐ, టీడీపీ, టీజేఎస్, వైఎస్సార్‌టీపీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు చందా సంతోష్, మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, వైస్ ఎంపీపీ కేవిరావు, ఉపసర్పంచ్ పుచ్చకాయల శంకర్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాయంకు సన్మానం

స్థానిక సీపీఐ కార్యాలయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు. సీపీఐ నాయకులు, అంతకు ముందు లారీ యార్డ్ వద్ద బొగ్గు ముఠా కార్మికులు ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అయోధ్య చారి, టీపీసీసీ నాయకులు చందా సంతోష్, మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, పట్టణ అధ్యక్షుడు సామా శ్రీనివాసరెడ్డి, ఉపసర్పంచ్ పుచ్చకాయల శంకర్, సీపీఐ నాయకులు సరెడ్డి పుల్లారెడ్డి, పాకలపాటి చందు, ఎంపీటీసీల సంఘం జిల్లా కార్యదర్శి గుడిపూడి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: పినపాక నియోజకవర్గ శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లును కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులు బుధవారం వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనారిటీ అధ్యక్షుడు మహమ్మద్ ఖాన్, నియోజకవర్గ అధ్యక్షుడు బషీరుద్దీన్, మండల అధ్యక్షుడు లతీఫ్, గుండాల అధ్యక్షుడు అబ్దుల్ నబి, బూర్గంపాడు ప్రధాన కార్యదర్శి మీరా, నాయకులు గౌస్ పాషా, రహీం, ఇమ్రాన్, ఖాసీం, యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల శుభాకాంక్షలు..

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు బుధవారం మణుగూరులో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మర్యాద పూర్వకంగా కలిశారు. అభినందనలు తెలిపి ఘనంగా సన్మానించారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సీపీఐ మండల కార్యదర్శి అనంతనేని సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు కమటం వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్ ఆధ్వర్యంలో సీపీఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కలిసి అభినందనలు తెలిపారు. మండలంలోని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై జ్యోతి

మణుగూరురూరల్: మండలంలోని శ్రీవిద్య టెక్నో జూనియర్ కళాశాలలో పోలీసులు బుధవారం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్సై బి.జ్యోతి మాట్లాడుతూ.. అనవసరంగా వచ్చే మెసేజ్‌లను, లింకులను ఓపెన్ చేయకూడదన్నారు. బ్యాంకు సిబ్బంది అంటూ ఎవరైనా మీ బ్యాంక్ వివరాలు, ఓటీపీలు, ఇతర వివరాలు చెప్పమంటే వారికి ఎలాంటి సమాచారమూ ఇవ్వొద్దని సూచించారు. ప్రధానంగా ఆడపిల్లలు సోషల్ మీడియా వినియోగంలో, ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పుచ్చకాయల శంకర్, ప్రిన్సిపల్ నాగేశ్వరరావు,కాడమిక్ డైరెక్టర్ సారంగపాణి, పోలీస్ కానిస్టేబుళ్లు కనకయ్య, ఎం.పుల్లమ్మ, దాస్, కె.కృష్ణ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన కార్తీక మాస పూజలు



అన్నపురెడ్డిపల్లి: ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



మణుగూరు పట్టణంలోని శివాలయంలో..

భద్రాచలంటౌన్: కార్తీకమాస వ్రత పూజలు చివరి రోజు బుధవారంతో ఘనంగా ముగిశాయి. గత నెల రోజులుగా పట్టణంలోని పలు ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు, వ్రతాలు, కార్తీక దీపాల కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్తీక మాసంలో చివరి రోజు కావడంతో మహిళలు గోదావరి నదికి చేరుకుని గోదారమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి, కార్తీక దీపాలను వెలిగించారు. అరటి డొప్పలతో నదిలో దీపాలను విడిచారు. అనంతరం నదీ తీరంలోని శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, ఆంజనేయ స్వామివారి ఆలయాలతో పాటు రామాలయంలో పూజలు నిర్వహించి కార్తీక దీపాలను వెలిగించారు. భక్తులు భారీగా తరలిరావడంతో రామలయంలో సందడి వాతావరణం నెలకొంది.

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో కార్తీక మాస చివరి రోజు బుధవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు, అర్చనలు తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయంలో భక్తులు దీపాలను వెలిగించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

‘గుర్తింపు’ ఎన్నికల్లో ఆదరించండి



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ రాంగోపాల్



మాట్లాడుతున్న టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రావు

మణుగూరుటౌన్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం అనంతరం గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చొరవతో దేశంలో ఏ బొగ్గు పరిశ్రమలో లేని అనేక అభివృద్ధి, సంక్షేమ, నూతన హక్కులు సాధించినట్లు టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వి.ప్రభాకర్‌రావు అన్నారు. బుధవారం ఓసీ–4 గేట్ మీటింగ్ ఫిట్ సెక్రటరీ ఈసం శ్రీను అధ్యక్షతన జరగ్గా ఆయన హాజరై మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో హడావుడి చేయడం తప్ప జాతీయ సంఘాలతో ఒరిగేదేమీ లేదన్నారు.

కారుణ్య నియామకాలు, తల్లిదండ్రులకు సూపర్ స్పెషాలిటీ వైద్యం, ఉచిత ఏసీ సౌకర్యం, మహిళలకు, వికలాంగులకు కారుణ్య నియామకాలు వడ్డీ లేని రుణం రూ.10లక్షల, మెరుగైన లాభాల వాటా ఇలా అనేక సంక్షేమం సాధించిన ఘనత టీబీజీకేఎస్‌దేనన్నారు. రానున్న ఎన్నికల్లో బ్యాలెట్‌పై ఉన్న 10వ నంబర్ బాణం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఏఐటీయూసీ నేతలు జోగ రావు, రమేశ్‌లు యూనియన్‌లో చేరగా, కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు రవూఫ్, వీరభద్రయ్య, వర్మ, బాణోత్ కృష్ణ, ఈసం శ్రీను, ఫిట్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీని గెలిపించండి

కేవలం పైరవీలకు, స్ట్రక్చర్ సమావేశాలను, సేఫ్టీ బైపార్టికేటెడ్ సమావేశాలకు యాజమాన్యం దగ్గర హక్కులను టీబీజీకేఎస్ తాకట్టు పెట్టిందని, అలాంటి టీబీజీకేఎస్‌ను ఓడించి ఏఐటీయూసీని గెలిపించాలని ఆ బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్ కోరారు. బుధవారం మణుగూరు ఓసీలో ఫిట్ మీటింగ్ జరగ్గా, ఆయన హాజరై మాట్లాడుతూ.. ఏఐటీయూసీ హయాంలో వేజ్‌బోర్డ్ సాధనలో ఏఐటీయూసీ పెద్దన్న పాత్ర పోషించిందని తెలిపారు. దేశంలో ఏ ప్రభుత్వ రంగ సంస్థలో లేని లాభదాయకమైన వేతన ఒప్పందాన్ని కార్మికుల పక్షాన చేశామన్నారు. ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో ఏఐటీయూసీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ మల్లెల రామనర్సయ్య, ఆదర్ల సురేందర్, నాయకులు కోడిరెక్కల శ్రీనివాసరావు, బండారి రవి, సాయి ప్రకాశ్ చారి, కందిమల్ల శ్రీనివాసరావు, మంద కోటేశ్వరరావు, యూనియన్ కౌన్సిల్ మెంబర్స్, డెలిగేట్స్ తదితరులు పాల్గొన్నారు.